క్లుప్తంగా

పోరుమామిళ్ల ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి సోమవారం విధుల్లో చేరారు. చక్రాయపేట నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా చూస్తామన్నారు.

చిన్నప్పటి నుంచే యోగాసనాలు నేర్చుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు చిన్నప్పటి నుంచే యోగాసనాలు నేర్చుకోవాలని వసంతపేట మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి తెలిపారు. వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరసౌష్టవం అలవడటమేగాక మంచి జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు. యోగా టీచర్లు శ్రావణి, వెంకటసుబ్బమ్మ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ విద్యార్థులకు నీతికథలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, రెహ్మాన్‌ఖాన్, శారద తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి క్రికెట్ పోటీలు

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం గ్రామంలో ఈ నెల 21వ తేదీన జరగనున్న పోలేరమ్మ తిరునాల సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.15,016, రెండవ బహుమతి రూ.7,016 అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 16వ తేదీ సాయంత్రం లోపు రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8328130920, 9866346928 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం

పోరుమామిళ్ల : పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యమని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఫారెస్టు సిబ్బంది విద్యార్థులతో కలసి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు, పేపర్లు, చెత్త గుట్టగా వేసి కాల్చారు. అనంతరం ఆయన 'పర్యావరణం–జీవనశైలి' ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కరుణాకర్, వెంకటేష్, కిశోర్, బాషా పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులో స్పోకెన్ ఇంగ్లిష్



శిక్షణకు హాజరైన విద్యార్థులు

రాజుపాళెం : సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌ను బోధిస్తున్నట్లు రాజుపాళెం గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపాడు. సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం ఉపాధ్యాయుడు పురుషోత్తం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో 22 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇంగ్లిషు తెలుసుకోవడం వల్ల విద్యార్థులు ఇతరులతో మాట్లాడేటప్పుడు ఎలా, ఏ విధంగా మాట్లాడాలో, అలాగే వ్యక్తిని ఎలా ఆహ్వానించాలో తెలుస్తుందన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో సోమవారం వృద్ధ బ్రాహ్మణుడు, శ్రీకృష్ణ ఉపాసకులు శ్రీమాన్ వైకుంఠదాసును ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ సోదరుడు ఆర్.ప్రసాద్ సత్కరించారు. ఆర్‌వీఎస్ ట్రస్ట్ తరఫున రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందచేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కల్లూరు ప్రసాదరెడ్డి, బద్వేలు వాసు, ప్రశాంత్, ప్రేమ్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'పై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డాక్టర్ దినేష్

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు డాక్టర్ దినేష్ తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో సోమవారం కంటి వెలుగుపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల గురించి సిబ్బందితో మాట్లాడారు. త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ అధికారి రఘురామిరెడ్డి వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ నాగజ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేగవంతంగా సమస్యలకు పరిష్కారం

బ్రహ్మంగారిమఠం : స్పందనలో ప్రజలు ఇచ్చిన అర్జీల మేరకు ఆయా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని స్పందన మండల ఇన్‌చార్జి, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం ఆయన తోట్లపల్లె గ్రామ సచివాలయంలో మండల స్థాయి అధికారులతో కలసి ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేకంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి, మండల ప్రత్యేక అధికారి నరసింహరెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని బద్వేలు తహసీల్దారు వై.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతి సోమ, గురువారాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమం ఆయా పంచాయతీల్లోని సచివాలయాల్లో నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు ఆయా గ్రామాల నుండి మండల స్థాయి కార్యాలయాలకు రాకుండా ఆయా గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి మండల స్థాయి అధికారి, సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సూర్యనారాయణరెడ్డి, మెడికల్ ఆఫీసర్ జోత్స్నస్వర్ణలత, వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, పంచాయతీ ఉప సర్పంచ్ కుప్పాలర మణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలసపాడులో



కలసపాడు సచివాలయంలో స్పందన నిర్వహిస్తున్న అధికారులు

కలసపాడు : స్థానిక సచివాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనలో నూతన కొళాయి కనెక్షన్ కోసం, వీధి దీపాల మరమ్మతులు చేయాలని అర్జీలు అందాయని ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ బ్రహ్మానందరెడ్డి, వెలుగు ఏపీఎం నాయుడు, ఈఓపీఆర్‌డీ మురారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోపవరం : గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం సచివాలయాల్లో నిర్వహించాలని అన్నిశాఖల అధికారులు ఇక్కడ పాల్గొని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించడంతో సోమవారం గోపవరం సచివాలయంలో మండల స్థాయి అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎక్కువగా రెవెన్యూపరంగా వినతులు రావడంతో వెంటనే రెవెన్యూ అధికారులు వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాయంత్రంలోపు పరిష్కరించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాజుపాళెంలో మాట్లాడుతున్న అధికారులు

వారానికి రెండు సచివాలయాల సందర్శన

ప్రొద్దుటూరు : వారానికి రెండు మార్లు మండల పరిధిలోని సచివాలయాలను సందర్శిస్తామని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగో సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై స్పందన అర్జీలను సచివాలయాల్లోనే స్వీకరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమ, గురువారాల్లో రెండు సచివాలయాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యలపై 1902 ద్వారా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ సచివాలయం పరిధిలో వీధి లైట్లు, మైలవరం కాలువలో పూడికతీతకు సంబంధించి అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ చిరంజీవి, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

వారంలో రెండు రోజులు స్పందన

చిన్నసింగనపల్లెలో..

దువ్వూరు : మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ రమకుమారి మాట్లాడుతూ ప్రతి సోమ, గురువారాల్లో గ్రామ సచివాలయాలను మండల స్థాయి అధికారులు సందర్శిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సచివాలయాల్లో అందించాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి శివజ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని సచివాలయాల్లో ప్రతి సోమ, గురువారాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇందిరా రాణి, ఎంపీడీఓ సయ్యుదన్నీసా తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాళెం సచివాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ షాజియా అధ్యక్షతన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను కలెక్టర్, మండల కార్యాలయాల వద్దకు వెళ్లకుండా స్థానిక సచివాలయంలో ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే సచివాలయాల వారిగా ప్రతి సోమ, గురు వారాల్లో మండల స్థాయి అధికారులతో స్పందన సమావేశాలు నిర్వహిస్తారన్నారు. కావున రైతులు, ప్రజలు తమ సమస్యలపై స్పందనలో అర్జీ ఇచ్చినప్పుడు రసీదు తప్పకుండా తీసుకోవాలని వారు సూచించారు. గ్రామ సచివాలయాల వారిగా 18న టంగుటూరు, 22న కూలూరు, 25న కుమ్మరపల్లె, 29న అర్కటవేముల, జూన్ 1న ఏరువపాళెం, 5న పర్లపాడు, 8న వెలవలి, 12న చిన్నశెట్టిపల్లె, 15న గాదెగూడూరు, 19న రాజుపాళెం, 22న కూలూరు, 26న టంగుటూరు, 29న కొర్రపాడు గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, వెలుగు ఏపీఎం జయరాజ్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ శేఖర్, ఈసీ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ నగర్‌లో త్వరలో డ్రైనేజీ పనులు మొదలు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని 7వ వార్డులో ఉన్న గోకుల్‌నగర్‌లో త్వరలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. గోకుల్ నగర్ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కలిశారు. తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ రూ.169 కోట్లతో పట్టణంలో డ్రైనేజీ కాలువలు నిర్మించేందుకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈనెలాఖరులో పనులను ప్రారంభించి రెండు నెలల్లో గోకుల్ నగర్‌లో పనులు చేపడుతామన్నారు. ముందుగా డ్రైనేజి కాలువలను నిర్మించిన తర్వాత సిమెంటు రోడ్లు వేస్తామని పేర్కొన్నారు. వీటి నిర్మాణ సమయంలో కాలనీ వాసులకు కొంత అసౌకర్యం ఉంటుందని, అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. త్వరలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో కలసి గోకుల్‌నగర్‌లో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాలువల నిర్మాణానికి సంబంధించి డిజైన్‌ను కాలనీ వాసులకు చూపించి వివరించారు.



కాలువల డిజైన్ చూపించి వివరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

పోలీసుల చొరవతో మెరుగుపడిన రహదారి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల నుంచి విజయవాడ వెళ్లే దారిలో పట్టణ శివారులో మల్లకతువ మలుపులో కంప చెట్లు పెరిగిపోయి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ఎదురెదురు వాహనాలు మలుపులో కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో పోలీసుల చొరవతో పరిష్కారం లభించింది. రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించక పోవడంతో పోలీసులు రంగంలో దిగి జేసీబీతో కంపచెట్లను తొలగించడంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు. మొన్న అలా ఉన్న దారి నేడు ఇలా కావడంతో అందరూ పోలీసుల కృషికి అభినందనలు తెలుపుతున్నారు.



రహదారికి ఇరువైపులా కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఉప్పలూరులో బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి తిరునాల సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.లక్ష, ప్రకాశం జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వెంకటస్వామి వృషభాలు రెండవ బహుమతి రూ.70 వేలు, అదే గ్రామానికి చెందిన మునీశ్వరయ్య వృషభాలు మూడవ బహుమతి రూ.40 వేలు, నరసాపురం గ్రామానికి చెందిన వెంకటప్రతాప్‌రెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలు, పాల్గొన్న ప్రతి వృషభాలకు ఒక్కొక్క జతకు రూ.5 వేలు చొప్పున యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజనారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి, సంఘసేవకులు బి.ఎస్.నారాయణరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డి

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని నాగులచెరువు కట్ట వద్ద వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా సోమవారం నిర్వహించిన ఆంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ఆకుపూజతో పాటు సింధూర అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి సాయంత్రం నుండి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామోత్సవం వెంబడి ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సన్నిబోయినసుబ్బరాయుడు యాదవ్, వైస్‌ప్రెసిడెంట్ చెన్నయ్య, సెక్రటరీ డి.వెంకటరమణ, ట్రెజరర్ దూళ్ళరమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గ్రంథాలయంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో సోమవారం చిన్నారుల సందడి కనిపించింది. బాలల వేసవి శిక్షణ శిబిరంలో నిర్వాహకులు శిక్షకుల ద్వారా పలు విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహింపజేశారు. కథలు చెప్పడం, చెప్పించుకోవడం, అభిప్రాయాలు సేకరించడం, బొమ్మలు గీయడం, రంగులు అద్దడం, వేమన పద్యాలు నేర్పడం, కంఠస్తం చేయించడం, రాగయుక్తంగా ఆలపించడం తదితర అంశాలను శిక్షకులు నేర్పారు. ముఖ్యంగా పాటలు, కథలు, రంగుల చిత్రాలు గీయడం అంశాల్లో చిన్నారులు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా శిబిరం శిక్షకులు జేడీ దేవదత్తం చిన్నారులకు దేశభక్తి గీతాలను నేర్పారు. కాగా కడప నగరానికి చెందిన నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు ఈ సందర్భంగా శిక్షణకు హాజరవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం 15 చాపలను అందజేశారు.



చాపలను అందజేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు

గాండ్లతెలికుల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాండ్ల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు జి.నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 450 పైగా మార్కులు, ఇంటర్‌లో 850 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. అలాగే 1 నుంచి 10వ తరగతి చదివే పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9398674595 నంబరుకు సంప్రదించాలని కోరారు

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబరచిన తొగటవీరక్షత్రియ విద్యార్థులకు 11వ వార్షిక ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తొగటవీరక్షత్రియ సేవాసంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తెలిపారు. వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 450 పైగా మార్కులు, స్థానికంగా ఇంటర్ చదివి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతి గ్రూపులో 800పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందచేస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ లోపల తమ దరఖాస్తులను తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో అందచేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9849203829 నంబరుకు సంప్రదించాలని కోరారు.

బీసీ విద్యార్థుల ప్రతిభకు పట్టాభిషేకం

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ విద్యార్థులకు ది బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో 13వ వార్షిక ప్రతిభకు పట్టాభిషేకం, పేదవిద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో అత్యధిక మార్కులు, స్థానికంగా ఇంటర్ చదివి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అన్నిగ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన బీసీ విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం ప్రశంసా పత్రం అదిస్తామన్నారు. అర్హులు ఈ నెల 28లోపల ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు అందచేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9030776200, 9985745462కు సంప్రదించాలని కోరారు.

వానరానికి అంత్యక్రియలు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని గిద్దలూరు రోడ్డుపై వానరం రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందింది. వానర గుంపు గుమికూడి మూగ రోదనతో రోదించడం స్థానికులను కంటతడి పెట్టించింది. గమనించిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్నిరామకృష్ణారెడ్డి మృతిచెందిన వానరాన్ని తన వాహనంలో తీసుకెళ్ళి వివేకానంద ఆశ్రమం పక్కన అంత్యక్రియలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు డి.ప్రభాకర్‌రెడ్డి, రామతులసి పాల్గొన్నారు.

తబలా విద్వాంసుడి మృతికి సంతాపం

బద్వేలు అర్బన్ : బద్వేలుకు చెందిన అన్నమాచార్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆలిండియా రేడియో తబలా కళాకారుడు ఎద్దుసుబ్బన్న ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈయన మృతికి అన్నమాచార్య కళానికేతన్ ప్రధాన బాధ్యులు ఎం.సునీల్‌కుమార్, కె.ఓబులేసు, టి.శ్రీనివాసులు తదితరులు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఎన్నో సంగీత సభలలో పాల్గొనడంతో పాటు ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దిన సుబ్బన్న మృతి కళాభిమానులకు తీరని లోటని అన్నారు.

లోకేష్ వెయ్యి రోజులు పాదయాత్ర చేసినా ఫలితముండదు

కడప సెవెన్‌రోడ్స్ : యువగళం పేరుతో లోకేష్ వెయ్యి రోజులు పాదయాత్ర చేసినా అధికారంలోకి రావడం కల్ల అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధిపై కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్‌లతో చర్చించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర ప్రధాన ఉద్దేశ్యం ఏమిటో చెప్పాలని తొలుత తాను ప్రశ్నించానన్నారు. కేవలం చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయాలన్న తపన మినహా పాదయాత్రకు మరో ఉద్దేశ్యం ఏదీ లేదన్నారు. ప్రజల్లోకి వచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి రూ. లక్ష కూడా కేటాయించలేదన్నారు. ఆయన చేసిన ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్లు, నిరుద్యోగ భృతి ప్రొద్దుటూరులో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. దోమకాటు వల్ల విష జ్వరాలు ప్రబలి ఎంతో మంది మృతి చెందుతున్నారని, డ్రైనేజీ పనులకు రూ. 150 కోట్లు అడిగినా చంద్రబాబు ఒక్క పైసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. జగన్ అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ.13,500 ఇచ్చారని తెలిపారు. తన నియోజకవర్గంలో రూ. 160 కోట్లు డ్వాక్రా రుణం మాఫీ చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రొద్దుటూరులో అర్హులైన పేదలకు 24 వేల ఇళ్లు మంజూరు చేశారన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

బీటెక్, ఎంబీఏ ఫలితాల్లో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు: 2022–23 విద్యా సంవత్సరం అటానమస్ బ్యాచ్‌కు చెందిన బీటెక్ ఫస్టియర్, ఎంబీఏ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంటు వి.జయచంద్రారెడ్డి తెలిపారు. సీఎస్ఈ విభాగంలో పి.శ్రీగౌరి ప్రియ 96.13 శాతం, అఖిల 93.50, పి.మహేష్ రావు 93.13 శాతం సాధించారు. సీఎస్ఈ ఏఐఎంఎల్‌లో అనూష 92.75 శాతం, కీర్తి 91.63, వెంకట ధనశ్రీ 91 శాతం, సీఎస్ఈ ఏఐ విభాగంలో వెంకట సునీత 88.63 శాతం, మహబూబ్ చాంద్ 88.38, రచన 87.25, సీఎస్ఈ డీఎస్ విభాగంలో భావన 88 శాతం, ఎస్.సుచిత్ర 87.88, సుష్మ 87.25, ఈసీఈలో జయంత్ 94.88, నాగలక్ష్మీ 89.75, వెంకట పల్లవి 89.63 శాతం సాధించారు. ఈఈఈ విభాగానికి చెందిన భవ్య శ్రీ 92.25 శాతం, అనిత 91.63, వైష్ణవి 89.75 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించగా, ఎంబీఏలో ప్రియాంక 88.75 శాతం, అంజలి 86.50, ఆయేషా 83.13 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తమ కాలేజీ విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.



బీటెక్, ఎంబీఏ ఫలితాలను చూపిస్తున్న సీబీఐటీ అధ్యాపకులు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా సోమవారం వృషభరాజముల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీలను ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు ముని రెడ్డి

పర్యావరణాన్ని కాపాడటం మన బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ అధికారి హేమాంజలి తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలోని అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు సోమవారం పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన లైఫ్ అనే కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. డీఆర్ఓ లక్ష్మయ్య, ఎఫ్‌బీఓలు జనవిజ్ఞాన సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న ఎఫ్ఆర్ఓ హేమాంజలి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్రంలో 22 లక్షల మంది కార్మికులను నమోదు చేయించారని పేర్కొన్నారు. సంక్షేమ కార్డుల ద్వారా ఫలాలు అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వం వాడుకున్న రూ. 1600 కోట్లు వెంటనే సంక్షేమ బోర్డులో జమ చేయాలని కోరారు. ఇప్పటివరకు 32 వేల పైబడి క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సంక్షేమ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లాప్రధాన కార్యదర్శి మద్దిలేటి, నాయకులు నాగిరెడ్డి, రామాంజనేయులు, బాలాజీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.